కొనసాగుతున్న ఏసీబీ విచారణ

నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో రోజూ రిజిస్ట్రేషన్‌లు నిల్



నిర్మానుష్యంగా నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నరసాపురం: నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వ్యవహారాలపై ఏసీబీ లోతైన విచారణ చేపట్టింది. బుధవారం సాయంత్రం కార్యాలయంపై ఏలూరు ఏసీబీ అధికారులు దాడులు చేయడం, సబ్ రిజిస్ట్రార్ వద్ద రూ.50 వేలకు పైనే అనధికార సొమ్ము దొరకడం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి క్రిమినల్ కేసులకు ఉపక్రమించాలని నిర్ణయించినట్టు ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ స్పష్టం చేశారు. ఏడాది కాలంగా జరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల వివరాలపై ఏసీబీ దృష్టి సారించింది. గురువారం సబ్‌రిజిస్ట్రార్‌తో సహా సిబ్బందిని ఏలూరు ఏసీబీ కార్యాలయానికి విచారణకు పిలిచారు. వరుసగా శుక్రవారం కూడా సబ్ రిజిస్ట్రార్, మరో సీనియర్ అసిస్టెంట్‌ను విచారణకు ఏలూరు రప్పించారు. లోతైన విచారణ జరిపి ఈ వ్యవహారంలో అధికారులతోపాటు ప్రమేయం ఉన్న లేఖర్లపై కూడా చర్యలు చేపట్టాలనే ఆలోచనలో ఏసీబీ ఉంది.

రెండో రోజూ రిజిస్ట్రేషన్లు నిల్

శుక్రవారం వరుసగా రెండో రోజు కూడా ఒక్క రిజిస్ట్రేషన్ జరగలేదు. గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ స్థానంలో పాలకొల్లు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఏసీబీకి చిక్కిన స్థానిక సబ్ రిజిస్ట్రార్ వీరభద్రరావుపై ఇంకా ఎలాంటి కేసు నమోదు చేయకపోవడంతో శుక్రవారం మళ్లీ ఆయన బాధ్యతలు తీసుకుని ఏలూరు ఏసీబీ విచారణకు వెళ్లారు. రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో కీలకంగా ఉన్న కొందరు లేఖర్లు ఈ రెండురోజుల నుంచి రాకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయినట్లు భావిస్తున్నారు. అధికారులను, సిబ్బందిని కార్యాలయంలో అందుబాటులో పెట్టినా రిజిస్ట్రేషన్‌లు రెండురోజులుగా నిలిచి పోవడానికి కారణాలపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంతో అత్యవసరం ఉన్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

పాలకొల్లు సెంట్రల్: విద్యా స్వేచ్ఛ, సమానత్వం, సౌభాగ్యం అనే మూడు అంశాలపై విద్యా విధానం అభివృద్ధి చేస్తుందని సెంట్రల్ యూనివర్సిటీ డీన్, సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. శుక్రవారం బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో నూతన జాతీయ విద్యా విధానంపై అవగాహనా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. దేశ విద్యా విధానంలో సమాన అవకాశాల కల్పన లేకుండా మొత్తం ప్రామాణిక పరీక్షల నిర్వహణ అత్యంత కష్టమవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం హరగోపాల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, హరగోపాల్ సతీమణి ప్రొఫెసర్ వనమాల, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, అకాడమిక్ అడ్వైజర్ నందుల సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఆలయ పునర్నిర్మాణ పూజలు


మావుళ్లమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న దంపతులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బ్రాడీపేట కాలువ గట్టున కొలువై ఉన్న శ్రీ మావుళ్లమ్మ ఆలయం పునర్నిర్మాణ పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. శుక్రవారం గేదెల వాసు, మానేపూరి శ్రీనివాస్, రెడ్డి చిన్ని దంపతులు మొదటి రోజు కలశస్థాపన, హోమం పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆదివారం ఉదయం 7:25 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఇండియన్ బ్యాంక్ సేవలు అభినందనీయం


బాలికోన్నత పాఠశాలలో పరికరాలు అందిస్తున్న ఇండియన్ బ్యాంక్ సిబ్బంది

పెనుగొండ: విద్యావ్యాప్తికి ఇండియన్ బ్యాంక్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్వీకేపీ విద్యా సంస్థల పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు అన్నారు. శుక్రవారం పెనుగొండలోని ఎస్వీకేపీ అండ్ కోట్ల వెంకట్రామయ్య బాలికోన్నత పాఠశాలకు ఇండియన్ బ్యాంకు సహకారంతో పెనుగొండ శాఖ మేనేజర్ రఘురామ్ సీలింగ్ ఫ్యాన్స్, ట్యూబ్ లైట్లు, వాటర్ వాటర్ డిస్పెన్సర్‌లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దండు పద్మావతి, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శశి విద్యార్థుల ప్రతిభ


డీఏఎస్ శివమణి


ఎం.రమ్య దీపిక


సీహెచ్ మౌనిక


వి.ప్రిన్స్ శ్రీ సూర్య


జి.అంకిత

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రులో ఉన్న శశి విద్యా సంస్థల విద్యార్థులు ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను శివమణి 464 మార్కులు, బైపీసీ విభాగంలో 440 మార్కులకు గానూ ముత్యాల రమ్యదీపిక 430 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో చోడిశెట్టి మౌనిక 987/1000 మార్కులు, బైపీసీ విభాగంలో గొల్లమండల అంకిత 981, వీరా సూర్య 981 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, ప్రిన్సిపాల్ చక్కా రాంప్రసాద్, బ్రాంచ్ ఇన్‌చార్జ్ కిషోర్‌కుమార్, అధ్యాపక సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

మేరికి పరామర్శ


మేరిని పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మహిళా నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ఇటీవల అగ్రకుల వ్యక్తుల చేతిలో అతిదారుణంగా గాయపడిన రొక్కాల మేరిని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు పరామర్శించారు. శుక్రవారం స్థానిక లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న మేరి ఇంటికి వెళ్లిన ఎమ్మెస్పీ జాతీయ నాయకురాలు చవటపల్లి విజయ ఆమెను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయ మాట్లాడుతూ మేరిపై దాడి చేసిన నిందితులపై 307 సెక్షన్ వేసి వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మేరికి ఆత్మరక్షణ కల్పించాలన్నారు. మేరికి న్యాయం జరిగే వరకూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మహిళా విభాగం ఆమెకు అండగా నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో నమ్మిన లక్ష్మీ, జిల్లా అధ్యక్షురాలు నెట్టెం ర్యూబీ, కొలికపాము హైమావతి, బుజ్జారి మేరి, స్థానిక నాయకులు పసుపులేటి చిన బాబు, కండవల్లి యేసు, సిర్రా మహేష్, ననమండ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దేశ శాంతికి సైకిల్ యాత్ర


సిద్ధాంతం చేరుకొన్న విజయ గోపాలకృష్ణ సైకిల్ యాత్ర

పెనుగొండ: దేశ శాంతిని కోరుకుంటూ కర్ణాటక రాయచూర్ జిల్లా సింధనూర్ నుంచి ప్రారంభించిన విజయగోపాలకృష్ణ సైకిల్ యాత్ర శుక్రవారం సిద్ధాంతం చేరుకొంది. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం కాకిలేరుకు చెందిన విజయ గోపాల కృష్ణ కర్ణాటక సింధనూరులో స్థిర పడ్డారు. శుక్రవారం సిద్ధాంతం చేరుకొని కేదారేశ్వర స్వామిని దర్శనం చేసుకున్న విజయగోపాలకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ 2022 మార్చి 11న సింధనూరులో యాత్ర ప్రారంభించనట్లు వివరించారు. అప్పటి నుంచి కేంద్ర పాలిత ప్రాంతాలతో కలిపి 15 రాష్ట్రాల్లో తీర్థ యాత్రలు చేసుకొంటూ 11 నదుల్లో పుణ్య స్నానాలు చేస్తూ, పూరిజగన్నాథేశ్వర స్వామి, అన్నవరం, ద్రాక్షారామం నుంచి సిద్ధాంతం చేరుకున్నట్లు వివరించారు. 2003లో సిద్ధాంతంలో గోదావరి పుష్కరాలు స్నానమాచరించిన అనంతరం ఇపుడ సిద్ధాంతం వచ్చినట్లు తెలిపారు. 20 సంవత్సరాలుగా పలు సైకిల్ యాత్రలు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 411 రోజుల్లో 36 వేల కిలో మీటర్లు యాత్ర చేశానని, 50 వేల కిలోమీటర్లు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు తెలిపారు. పుణ్య క్షేత్రాలు సందర్శించి దేశ శాంతి కోసం దేవుళ్లను మొక్కుకుంటున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

నరసాపురం: బంధువుల ఇంటికెళ్లిన తన తండ్రి కనిపించడం లేదంటూ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై నరసాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామానికి చెందిన బొంతు కృష్ణ (58) గురువారం బంధువుల ఇంటికి అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి భీమవరం వెళ్లాడు. అక్కడ నుంచి నరసాపురంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నాని చెప్పి నరసాపురం వచ్చాడు. అయితే అప్పటి నుంచి అతను కనిపించకపోవడంతో కుమారుడు నాగరాజు శుక్రవారం పోలీసులను ఆశ్రయించడంతో నరసాపురం టౌన్ ఎస్సై కె.సుధాకరరెడ్డి కేసు నమోదు చేశారు.

ఇసుక బస్తాలతో కాలువకు అడ్డుకట్ట


కాలువలో అడ్డుకట్ట వేస్తున్న కార్మికులు

పాలకొల్లు సెంట్రల్: వేసవికాలం నీటి ఎద్దడి లేకుండా మునిసిపల్ అధికారులు ప్రత్యేక చర్యల్లో భాగంగా కాలువకు అడ్డుకట్ట వేశారు. గురువారం కాలువ కట్టివేయడంతో శుక్రవారం మునిసిపల్ అధికారులు స్థానిక దాసరి నారాయణరావు కాలిబాట వంతెన వద్ద కాలువకు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. మునిసిపల్ డీఈ సాంబశివుడు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేశామన్నారు. మళ్లీ కాలువలో జూన్ 10న నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. అప్పటి వరకూ అంటే నెలా 15 రోజులు పాటు పట్టణ ప్రజలకు నీటిని రెండు పూటలా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాలువలో అడ్డుకట్ట వేయడం వల్ల మరో పది రోజులు కాలువ నీటిని వాడుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పది రోజులు తదనంతరం ఎస్ఎస్ ట్యాంకుల్లో స్టోరేజ్ చేసిన నీటిని ఉపయోగిస్తామని తెలిపారు.

మునిసిపల్ ఉద్యోగులకు ఉచిత దంత పరీక్షలు


మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందికి దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ ఉద్యోగులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో మునిసిపల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మునిసిపల్ ఉద్యోగులకు దంత వైద్య పరీక్షలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి శ్రీనివాసరాజు మాట్లాడుతూ సుమారు వంద మంది ఉద్యోగులకు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, పేస్టులు అందజేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు ఈహెచ్ఎస్ కార్డు ద్వారా నగదు రహిత దంత వైద్య పరీక్షలు కేర్ డెంటల్ ఆసుపత్రి ద్వారా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, డాక్టర్ నదియా, అసోసియేషన్ సెక్రటరీ ఎంఆర్‌కే ప్రసాద్, డీఈ సాంబశివుడు, టీపీఓ వీరబ్రహ్మం, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో అలరించిన ప్రదర్శనలు


మంజుభార్గవి చేతు మీదుగా జ్ఞాపికలు అందుకుంటున్న విద్యార్థులు

నరసాపురం: కూచిపూడి నాట్యం పుట్టినిల్లు కూచిపూడిలో నరసాపురం శ్రీ ఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నారు. ఈ నెల 29న అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా కూచిపూడిలోని సిద్దేంద్ర కళాపీఠంలో సేవ్ కూచిపూడి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కూచిపూడి ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, కడప, కర్నూలు, గోదావరి జిల్లాలకు చెందిన 500 మంది కూచిపూడి నాట్య కళాకారులు హాజరయ్యారు. సేవ్ కూచిపూడి సంస్థ ఆహ్వానం మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి నరసాపురం ఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు ఐదుగురికి మాత్రమే అవకాశం దక్కిందని నృత్యనికేతనం డైరెక్టర్, నాట్యాచారిణి వలవల అనంతలక్ష్మీదేవి చెప్పారు. ఆమె శిష్యులు కె.ప్రణవి, వి.పద్మప్రియ, ఎస్.హంసిని, సీహెచ్ సంజన, పి.సుధావినయశ్రీ ఇచ్చిన ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. సినీ నటి, నాట్య కళాకారిణి మంజు భార్గవి చేతుల మీదుగా వీరు అవార్డులు అందున్నారు. అద్భుత ప్రదర్శనలతో అవార్డులు అందుకుని వచ్చిన వారికి మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, నృత్యనికేతనం అధ్యక్షుడు కర్నల్ ఆర్‌కేవీ రావు, ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ ఆర్.పార్థసారధి, అడ్మినిస్ట్రేటర్ ఆర్.భరణి అభినందనలు తెలిపారు.

ఆచంట సొసైటీ చైర్‌పర్సన్ శారదా దేవి మృతి


వైట్ల శారదా దేవి

పెనుగొండ: ఆచంట మృత్యుంజయ కో ఆపరేటివ్ సొసైటీ చైర్ పర్సన్ వైట్ల శారదా దేవి(64) గుండెపోటుతో మృతి చెందారు. గురువారం అర్ధరాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో తుదిశ్వాస వదిలారు. వైఎస్సార్ సీపీ పార్టీ ఆవిర్భావం నుంచి తన కుమారుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ కలిసి పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆచంట పరిసర ప్రాంతాలకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు శారదాదేవి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఎంపీపీలు పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), కేవీనారాయణ రెడ్డి(వాసు), సుమగళి, జడ్పీటీసీలు పోడూరు గోవర్ధన, గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరి సుభాషిణీ, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిర, మాజీ జడ్పీటీసీ ముప్పాళ వెంకటేశ్వరరావు, ఇందుకూరి ఉమాదేవి, సర్పంచ్‌లు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, శెట్టి బలిజ కార్పోరేషన్ డైరక్టరు మామిడిశెట్టి కృష్ణవేణి, అరిగెల కృష్ణవేణి, సొసైటీ కార్యదర్శి పారుపల్లి ఏసురత్నం, డైరక్టర్లు పెచ్చెట్టి సత్యనారాయణ, మెండే శ్రీను తదితరులు ఉన్నారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య


పొన్నపల్లి రామకృష్ణ (ఫైల్)

యలమంచిలి: మండలంలోని సీతారామపురానికి చెందిన పొన్నపల్లి రామకృష్ణ (30) చించినాడ వద్ద వశిష్ఠ గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంక్రాంతి సమయంలో సీతారామపురంలో కోడి పందేల వద్ద జరిగిన గొడవలో ఇద్దరు యువకులు రామకృష్ణను కొట్టారు. అనంతరం ప్రతి ఒక్కరూ రామకృష్ణను నిన్ను కొట్టారంట కదా అని అడుగుతుండుటతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో గురువారం ఇంటి నుంచి బయటకు వచ్చిన రామకృష్ణ సెల్ఫీ వీడియో తీసుకుని అన్న వరసయ్యే వ్యక్తికి పంపి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఈ సెల్ఫీ వీడియో ఆ వ్యక్తి చూడలేదు. రామకృష్ణ కనపడడం లేదని గురువారం తెలియడంతో అప్పుడు వీడియో చూసిన అతను రామకృష్ణ తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు వచ్చి చించినాడ వద్ద గోదావరిలో వెదకగా సాయంత్రం బాడవ గ్రామం వద్ద గోదావరిలో మృతదేహం లభ్యమైంది. దీంతో రామకృష్ణ తండ్రి సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్


పెనుగొండలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


శేరేపాలెంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పెనుగొండ: మండలంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. పెనుగొండలో మూడు, నాలుగు సచివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాయకులు, సచివాలయ కనీ్వనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలు అభిప్రాయాలను సేకరించారు. ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తాడి సుబ్బిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు వేంద్ర లీలా వెంకటరమణ, పలివెల శ్రీను, మెరిపే వెంకటేశ్వర్లు, యాదాల ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు నీరాజనం పడుతున్నారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పేర్కొన్నారు. మండలంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.

కొంతేరులో నాటిక పోటీలు ప్రారంభం


పేగురాసిన శాసనం నాటికలోని దృశ్యం

యలమంచిలి: కొంతేరు పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరంలో 41వ జాతీయ స్థాయి నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి నాటికగా గంగోత్రి- పెదకాకాని వారితో పేగురాసిన శాసనం నాటికను ప్రదర్శించారు. కడుపున పుట్టారనే ఒకే కారణంతో పిల్లలు ఏం చేసిన భరించాలా? వృద్ధాప్యంలో మనల్ని పట్టించుకోకపోయిన వారిపై గుడ్డి ప్రేమతో బతుకీడ్వాలా? అనే ఇతివృత్తంతో ఈ నాటిక ప్రదర్శించారు. రెండో నాటికగా శ్రీ సాయి కార్తీక క్రియేషన్స్-కాకినాడ వారితో ఎడారిలో వాన చినుకు నాటిక ప్రదర్శించారు. ఈ నాటిక కూడా తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న పిల్లల ఇతివృత్తంతోనే ప్రదర్శించారు. మొదటి రోజు నాటికలకు ప్రముఖ పాత్రికేయులు, రాష్ట్ర ప్రభుత్వ శ్రమ శక్తి అవార్డు గ్రహీత దివంగత విన్నకోట వెంకటేశ్వరరావు కళావేదిక పేరిట నాటికలు ప్రదర్శించారు.

చలివేంద్రం ప్రారంభం

నరసాపురం: వైఎన్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేస్టేషన్‌రోడ్డులో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వడగాల్పులకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు లక్ష కుంకుమార్చన


పెనుగొండ మూలవిరాట్ వాసవీ మాతకు 108 రకాల సారే సమర్పిస్తున్న దృశ్యం


వాసవీ శాంతి ధాంలో నిజామాబాద్ ఎమ్మెల్యే గణేష్ గుప్త

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో లక్ష కుంకుమార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ ఎమ్మెల్యే గణేష్ గుప్త దంపతులు ఆలయాన్ని సందర్శించారు. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కోట్ల మోహనరావు, నూలి తాతాజీ, ట్రస్టీలు, ఆర్యవైశ్య ప్రముఖులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో 102 అడుగుల పంచలో హ వాసవీ మాత విగ్రహాన్ని దర్శించుకొని, మరకత శిల వాసవీ మాతకు పూజలు అభిషేకంలు నిర్వహించారు.

మూలవిరాట్ వాసవీ మాతకు సారె సమర్పణ

నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతకు మహిళ భక్తులు 108 రకాల స్వీట్లుతో సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక దీపాలంకరణ చేశారు.

గుండెల నిండా అభిమానం


కుమారస్వామి

పాలకొల్లు అర్బన్: మండలంలోని చందపర్రు గ్రామానికి చెందిన బొందా కుమారస్వామి తన గుండెపై సీఎం జగన్ చిత్రాన్ని పచ్చబొట్టుగా వేయించుకుని వీరాభిమానం చూపా డు. కుమారస్వామి ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. దుబాయ్‌లో డ్రైవింగ్ పనిచేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నాడు. ఏప్రిల్ తొమ్మిదిన కుమారస్వామి ఇండియాకి వచ్చాడు. సీఎం జగన్ అంటే తనకు చాలా ఇష్టమని, ఆ కారణంతోనే జగన్ ఫొటోను తన గుండెపై పచ్చ బొట్టు వేయించుకున్నట్టు తెలిపాడు. తాను మళ్లీ దుబాయ్ వెళ్లే లోపు సీఎం జగన్‌ని స్వయంగా కలవాలనేది తన అభిమతమని చెప్పాడు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

సాక్షి, భీమవరం : ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమేగాక నాడు-నేడు, అమ్మఒడి వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ కోరారు. శుక్రవారం పట్టణంలోని దుర్గాపురం మునిసిపల్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక విద్య పటిష్ఠంగా ఉన్నపుడే ఉన్నత తరగతుల్లో విద్యార్థులు మంచి ప్రావీణ్యత పొంది ఉన్నత స్థితికి చేరతారన్నారు. సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యామసుందర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.వినాయకుడు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు పాఠశాలలో చేరి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంఘ సేవకులు అండలూరి జయలక్ష్మి ఆర్థిక సహకారంతో రూ.10 వేల విలువచేసే జ్ఞాపికలు, మెడల్స్‌ను ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏఎంవో శ్రీమన్నారాయణ, హెచ్ఎం షేక్ బాబాజీ సాహెబ్, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు వి.వెంకటలక్ష్మి వీవీఆర్ హనుమంతరావు ,శకుంతల, జి.ఆదిలక్ష్మి, సాలా శ్రీను, పి.శ్రీనివాసరావు, స్పందన, నాగలక్ష్మి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కాళ్ల : మండలంలోని ఎస్సీ బోస్ కాలనీ గ్రామంలో పేకాట ఆడుతున్నరాన్న సమాచారం మేరకు దాడి చేసి 6 గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఆకివీడు సీఐ గీతాకృష్ణ శుక్రవారం తెలిపారు. వీరి నుంచి రూ 36,000 నగదు, 4 సెల్ ఫోన్లు, 5 బైక్‌లు స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.